క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపవరం : మండలంలోని పి.పి.కుంట, శ్రీనివాసపురం, గానుగపెంట సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ చిన్నయ్య తెలిపారు. 33 కె.వి. విద్యుత్ లైన్‌కు సంబంధించి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ఘన నివాళి



బాలచంద్రారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : బీజేపీ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి భౌతిక కాయాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. బాలచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను రాచమల్లు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి మరణించిన విషయాన్ని తెలుసుకుని సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరుకు వచ్చారు. ఈ సందర్భంగా బాలచంద్రారెడ్డి భౌతికకాయానికి ఆయన నివాళి అర్పించారు. బాలచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను ఈశ్వరప్రసాద్ రెడ్డి పరామర్శించారు.

ఘన నివాళి

ప్రొద్దుటూరు : బీజేపీ సీనియర్ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి మృతికి శుక్రవారం పలువురు బీజేపీ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాలచంద్రారెడ్డి మృతదేహాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు కందుల మురళీమోహన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, పట్టణాధ్యక్షుడు నరేంద్రరావు, మహిళా మోర్చా పట్టణాధ్యక్షురాలు నల్లదిమ్ము కుమారి తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. కొవ్వూరు గ్యారేజిలో బాలచంద్రారెడ్డికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రమేష్‌రెడ్డి, కొవ్వూరు కృష్ణచైతన్యరెడ్డి, కొవ్వూరు హర్షవర్ధన్ రెడ్డి, కడప, పులివెందుల నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను ఆగస్టు 1వ తేదీలోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కోశాధికారి కె.శివకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగ కార్మికులకు బకాయి ఉన్న 2024 సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసాల వృత్తి ఆరోగ్య పథకం మంజూరు చేయడంతో పాటు అదనపు పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన మూడు నెలల బకాయి వేతనాలను మంజూరు చేయాలని కోరారు. పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మాజీ పట్టణ నాయకులు కె.నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంప్రవీణ్, డి.నాగేంద్రబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు హరి, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసులు, కమిటీ సభ్యులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవనం ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో బీసీ భవనంతో పాటు పూలే అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఏ.సత్తార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆవాజ్ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో 60 వేల పైచిలుకు బీసీ జనాభా ఉన్నప్పటికీ బీసీ భవనం లేకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. సమావేశంలో ఆవాజ్ ఉపాధ్యక్షులు గౌస్, నాయకులు రసూల్, రహీమ్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేయాలని వినతి

ప్రొద్దుటూరు : పట్టణం, మండలంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని శుక్రవారం ఎంఈఓ సావిత్రమ్మకు ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యాసామాగ్రిన్ని విక్రయించి తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా యోగా దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, యోగా గురువులు యోగ గొప్పతనాన్ని, యోగా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. స్థానిక ఎద్దుల వెంకట సుబ్బమ్మ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగాదినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎంఈఓ సావిత్రమ్మ పాల్గొని యోగ సాధన చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. జిల్లా ఆస్పత్రి ఆయుర్వేద డాక్టర్ అపర్ణ శ్రీరాం మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మానవుడు ఒత్తిడికిలోనై అనేక వ్యాధుల బారినపడుతున్నారని, దీనికి చక్కని ఔషధం యోగా, ధాన్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి యునాని వైద్యుడు డాక్టర్ నిరంజన్ నాయక్, డాక్టర్ మునిరాంప్రసాద్, డాక్టర్ మెహతాజ్, డాక్టర్ వైద్యనాథ్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనరసమ్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది, యోగా శిక్షకురాలు సునంద పాల్గొన్నారు.

రాయలసీమ వ్యాయామ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ దినోత్సవ వేడుకల్లో సంస్కృతి స్వచ్ఛంధ సేవాసంస్థకార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్, నిర్వహనాధికారి నరసింహారెడ్డి, యోగా నిపుణుడు డాక్టర్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.

రాణితిరుమల దేవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యోగాదినోత్సవ వేడుకల్లో యోగా గురువులు వెంకటరామిరెడ్డి, కృష్ణ, వెంకటరమణ, కరస్పాండెంట్ తరుణేందుశేఖర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వైద్య సిబ్బంది, పేషెంట్లు యోగా చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ భరత్ నారాయణ మాట్లాడుతూ యోగా చేయడం వలన అన్ని రకాల ఆరోగ్య సమస్యలు తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్యకళాశాలలో శుక్రవారం ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం చేకూరుతుందన్నారు. అనంతరం విద్యార్థులచే యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ ఇందిర, డాక్టర్ వాణి, డాక్టర్ రాజకిషోర్, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ జీవన, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు : క్రమం తప్పకుండా రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజిలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం యోగాసనాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు, డీన్ ఆచార్య కేవీ రమణయ్య, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎన్.హరినాథ్‌రెడ్డి, డాక్టర్ ఎస్.కిరణ్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు : ప్రపంచ దేశాలు యోగా దినోత్సవాన్ని నిర్వహించుకునేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. నామా ఎరుకలయ్య ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవా సమితి, బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నాగదస్తగిరిరెడ్డి, సోమా లక్ష్మీనరసయ్య, విశ్వహిందూ పరిషత్ నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

రాజుపాళెం : యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని టంగుటూరు గ్రామ జెడ్పీహైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బయ్య, మధుసూదన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత కోసం యోగా

మైదుకూరు : మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు యోగా చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా భారతదేశ వారసత్వ సంపదన్నారు. ఎన్నో దేశాలు యోగాను అనుసరిస్తున్నాయన్నారు. విద్యార్థులు యోగా చేస్తే వారిలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు రాధారామ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ బాలుర హైస్కూల్‌లో...

స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రపంచానికి యోగా అందించిన ఘనత మన దేశానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగ చేస్తే సంపూర్ణ ఆరోగ్యం

చాపాడు : ఆరోగ్యానికి మించిన ఆనందం మరోకటి ఉండదని యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం చాపాడులోని జెడ్పీ హైస్కూల్, కస్తూర్బా గురుకుల పాఠశాల, నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలల్లో యోగపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చాపాడు హైస్కూల్‌లో వైద్యాధికారి మాట్లాడుతూ సనాతనంతో ఋషులు, మహామునులు ధ్యానంతో ఉంటూ దైవాత్మ జ్ఞానాన్ని పొందడం జరిగిందన్నారు. అది యోగ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రతి రోజూ యోగ చేస్తే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే యోగను అలవాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సైతం బాధ్యతగా విద్యార్థులతో యోగ చేయించాలని సూచించారు. అనంతరం పలువురు వక్తలు యోగను ఉద్దేశించి ప్రసగించారు. అనంతరం విద్యార్థులతో కలసి వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది యోగ చేశారు. వైద్యాధికారులు కావ్య మాధురి, ఓబులేసు, మండల విద్యాధికారి రవిశంకర్, కేజీబీవీ స్పెషలాఫీసర్ నాగలక్ష్మీ, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గౌస్‌మొద్దీన్, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సీహెచ్‌ఓ మహదేవ యాదవ్, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్‌లు సరస్వతీ, బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీబీఐటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో..

స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీ, ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగను ఉద్దేశించి అధ్యాపకులు ప్రసంగించారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

పోరుమామిళ్ల : 10 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పోరుమామిళ్లలో వివిధ పాఠశాలల్లో యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గురుకుల గిరిజన పాఠశాలలో అంచల్ ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా «నిత్యసాధన ధ్యానమండలి» యోగా మాస్టర్ పాల్గొని విద్యార్థులతో వ్యాయామాలు, ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో అంచల్ అధ్యక్షులు చెన్నక్రిష్ణయ్య, సాధక్‌లు సుబ్బరాయుడు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో..

పట్టణంలోని వైష్ణవి ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో, వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రతినిధి బాలరంగయ్య ఆధ్వర్యంలో యోగా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

బి.కోడూరు : యోగా చేయడం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించి హైస్కూల్ విద్యార్థులకు యోగాసనాలు, వాటి ఉపయోగాల గురించి వివరించి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం యోగా చేయడం వలన శరీరం పటుత్వంతో పాటు మేధస్సు మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవన విధానంలో భాగం కావాలి

బద్వేలు అర్బన్ : మానవుని జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని, అప్పుడే మానవుడు ప్రశాంతంగా జీవనం సాగించగలడని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రీలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మానవుల జీవన విధానం గందరగోళంగా తయారైందని, ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడటానికి యోగా మంచి ఔషధమన్నారు. అనంతరం యోగా గురువులు అమరేంద్రనాథ్‌రెడ్డి న్యాయవాదులతో వివిధ రకాల ఆసనాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత

నిత్యజీవితంలో యోగాసనాలను అలవాటు చేసుకోవడం ద్వారా చక్కని క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడుతుందని రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ప్రముఖ యోగా గురువులు అమరేంద్రనాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో వ్యాధులు దూరం

ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అసంక్రమణ వ్యాధులను దూరం చేయవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ సౌమ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓ చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, వైద్య సిబ్బంది గంగాభవాని, శ్రీరాములయ్య, ఖాశీం, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ఆర్‌సీఈలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



బద్వేలు అర్బన్ : కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి, న్యాయవాదులు



రాజుపాళెం : టంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ...



చాపాడు : ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ...



బి.కోడూరు : యోగా చేస్తున్న విద్యార్థులు



ప్రొద్దుటూరు క్రైం : శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో యోగా చేస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది, పేషంట్లు



మైదుకూరు : మైదుకూరు డిగ్రీ కాలేజిలో యోగా చేస్తున్న విద్యార్థులు



చాపాడు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినిలతో కలసి యోగ చేస్తున్న వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది



మైదుకూరు : జెడ్పీ బాలుర హైస్కూల్‌లో యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పోరుమామిళ్ల : భుజంగాసనం చేస్తున్న విద్యార్థులు



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న వంగల శశిభూషణ్‌రెడ్డి



ప్రొద్దుటూరు : యోగాసనాలు నేర్పిస్తున్న గురువురు మునిశేఖర్‌రెడ్డి



ప్రొద్దుటూరు : యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న గుత్తేదారులు

చోద్యం చూస్తున్న అధికారులు

బి.కోడూరు : మండలంలో అక్రమ మట్టి తరలింపుకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గుత్తేదారులు అనుమతులు లేకుండా ఇష్టానుసారం మట్టిని తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. మున్నెల్లి, గోవిందాయపల్లె చెరువుల నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించిన గుత్తేదారులు విలువైన ఆయకట్టు చెరువులను సైతం వదలడం లేదు. మున్నెల్లి, గోవిందాయపల్లె చెరువుల్లో సుమారు 10 అడుగుల లోతు గుంతలు తీసి మట్టిని తరలిస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షాలకు వచ్చే వర్షపునీరు ఆ గుంతల్లోకే సరిపోతాయని, ఆయకట్టు కింద పైరును ఎలా సాగు చేసుకోవాలని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారుల నిబంధనల ప్రకారం చెరువుల్లో పూడికతీత పనులకు చెరువుకు సంబంధించి అలుగు లెవల్ తీసుకుని ఒక అడుగు లేదా రెండు అడుగులు మాత్రమే తీయాల్సి ఉంది. కానీ ఇలా యథేచ్ఛగా 10 అడుగులు లోతు తీసి మట్టిని తరలిస్తుంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చోద్యం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతులు పొలాలకు పూడికతీత మట్టిని తరలించాలన్నా.. రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి నిబంధనలు పెట్టారు. కానీ ప్రస్తుతం ఆ నిబంధనలు ఏమయ్యాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం తెలిపినా స్పందన లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇలా ఇష్టానుసారం చెరువుల్లో మట్టిని తరలిస్తే ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.



మున్నెల్లి చెరువు నుంచి టిప్పర్‌లలో మట్టిని తరలిస్తున్న దృశ్యం

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించండి



రాజుపాళెం: పగిడాలలో ర్యాలీ చేస్తున్న సూపర్‌వైజర్, కార్యకర్తలు

రాజుపాళెం : మండలంలోని పగిడాల గ్రామంలోని 1, 2 కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అధికారులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపించామన్నారు. అలాగే మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. అనంతరం తల్లులకు, చిన్నారులకు గర్భవతులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆవశ్యకత, బోధించే విధానం, అంగన్‌వాడీ ఆహార పోషణ గురించి తెలియజేశారు. అనంతరం వారికి ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు, పలకలు, పెన్సిల్‌లు, కంబాక్సులు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.భాగ్యమ్మ, ఆర్.మాధవి, ఆయా హెప్సిభ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యకాలనీలో గత కొన్నేళ్ళుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకులు ఎం.చిన్ని మాట్లాడుతూ సుందరయ్యకాలనీలో ఏళ్ళ తరబడి తాగునీటి వసతి లేకపోవడంతో అక్కడి ప్రజలు సమీపంలోని పొలాల్లోకి వెళ్ళి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని అన్నారు. గతంలో చేసిన ఆందోళనల ఫలితంగా బోరు వేసిన మున్సిపల్ అధికారులు మోటారు బిగించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ, అనంతమ్మ, నాయకులు ఆంజనేయులు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు